క్లుప్తంగా

రైతులు రుణాలు చెల్లించాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: వ్యవసాయ పనుల కోసం రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం నుంచి అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, డైరెక్టర్ ఎల్లా గౌడ్, సీఈవో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగం, శాస్త్రీయ విజ్ఞానం అనే అంశాలపై శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగం మౌలిక నిర్మాణం, శాస్త్రీయ దృక్పథం పెంపొందించే అంశాలు, శాస్త్రీయ ప్రయోగాలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు ఆకునూరు శంకరయ్య, జాతీయ ఉపాధ్యక్షుడు టీవీ.రావు, రాష్ట్ర అధ్యక్షుడు నర్ర రామారావు, జిల్లా అధ్యక్షుడు ఎనుగంటి రాజేశం, కార్యదర్శి రాపల్లి రాజగంగారాం, కో–ఆర్డినేటర్ జక్కుల తిరుపతి, సెక్రటరీ చందు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల: ప్రతి విద్యార్థి సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొనాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జరిగిన జాతీయస్థాయి యువజనోత్సవాల్లో మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి ప్రశంసా పత్రాలు పొందగా వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుల్తానా, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ సత్యప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, జమున, కిరణ్మయి, సునీత, మాధవి, జ్యోత్స్న, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు పునరుద్ధరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్లాపూర్: మండలంలోని వాల్గొండ గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కాంగ్రెస్ నాయకులు శనివారం మెట్‌పల్లి డిపో సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్గొండ గ్రామానికి వయా రాఘవపేట, మొగిలిపేట, పాతదాంరాజుపల్లి మీదుగా 30 ఏళ్లుగా నడిచిన ఆర్టీసీ బస్సు సేవలను నిలిపివేయడంతో ఐదు, ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కళాశాల విద్యార్థులు, విద్య, వైద్య, కిరాణ, వ్యాపార లావాదేవీలకు వెళ్లే గ్రామస్తుల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సు సేవలను పునరుద్ధరించాలని కోరారు.కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి బోయిని హన్మాండ్లు, మాజీ ఎంపీటీసీ భీమన్న, సకినపెల్లి రాములు, పల్లికొండ ప్రవీణ్, ఎండీ.షరీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం

మల్లాపూర్: మండలంలోని వీవీరావుపేట–రేగుంట మార్గంలో శనివారం రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ తెలిపారు. అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుకడంప్‌లను స్వాధీనం చేసుకుని పంచానామా నిర్వహించామన్నారు. వచ్చే నెల 2న డంప్ వద్దనే ఇసుక వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. దాడుల్లో ఆర్‌ఐలు రాజేశ్, సురేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుదారుల్లో ఆశలు

- గతంలో గృహలక్ష్మి.. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పేరిట దరఖాస్తులు స్వీకరణ
- ఈ సారైనా సొంతింటి కల నెరవేరేనా?



ప్రజాపాలనలో దరఖాస్తు చేస్తున్న ప్రజలు

కథలాపూర్: సొంతిల్లు కట్టుకోవాలనే పేదల కల సాకారం చేసేందుకు ప్రభుత్వాలు ఇళ్ల పథకాలు ప్రవేశపెడుతూ దరఖాస్తులు స్వీకరిస్తున్నాయి. మంజూరులో ఏళ్ల తరబడి జాప్యం జరగడం.. పాలకులు మారడంతో ప్రభుత్వ సాయంతో సొంతిల్లు నిర్మించుకోవడం కలగానే మిగిలిపోతోందని నిరుపేదలు వాపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం, రెండో సారి గృహలక్ష్మి పథకం పేరిట దరఖాస్తులు స్వీకరించింది. వాటికి మోక్షం కలగలేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం దరఖాస్తులు స్వీకరించడంతో ఆశావహులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ సారైనా సొంతిల్లు కల నెరవేరుతుందో లేదోనని మండలంలోని పేదలు ఆందోళన చెందుతున్నారు.

దరఖాస్తుల వెల్లువ

మండలంలో 19 గ్రామాలున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చాక డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం ప్రవేశపెట్టి మండలంలో మొదటి విడతగా ఆరు గ్రామాల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అప్పట్లో సుమారు 3 వేల మంది దరఖాస్తులు చేశారు. కేవలం 90 ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయి. కానీ కథలాపూర్, సిరికొండ, తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. ఈ ఏడాది ఆగస్టులో గృహలక్ష్మి పథకం పేరిట దరఖాస్తులు స్వీకరించగా.. 19 గ్రామాల నుంచి 1,890 మంది దరఖాస్తులు సమర్పించారు. 200 ఇళ్లు మంజూరు చేసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. పనులు ప్రారంభం కాకముందే ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరిట దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఈ సారైనా తమకు వరిస్తుందో లేదోనని పేదలు ఆశగా దరఖాస్తులు అధికారులకు ఇస్తున్నారు. పాలకులు ఇప్పుడైనా చొరవ చూపి కథలాపూర్ మండలంలో ఇళ్లు లేని పేదలకు త్వరగా మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.



గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేస్తున్న ప్రజలు(ఫైల్)

‘గృహలక్ష్మి’లో ఇల్లు మంజూరైంది



అద్దె ఇంట్లో ఉంటూ నేను బీడీలు చేస్తూ నా భర్త కూలీ పనిచేసి ముగ్గురు కూతుళ్లను పోషిస్తున్నాం. 4 నెలల క్రితం ఇల్లు కోసం దరఖాస్తు పెడితే గృహలక్ష్మి పథకంలో ఇల్లు మంజూరైందని చెప్పితే సంతోషపడిన. ప్రభుత్వం మారడంతో మంజూరైనా ఉట్టిదే అయింది. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం దరఖాస్తు పెట్టిన. మాలాంటి పేదలకు ఇల్లు మంజూరు చేసి నిధులు ఇవ్వాలి.

– ఈదుల లక్ష్మి, కథలాపూర్

20 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే..



సొంతిల్లు లేకపోడంతో 20 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్న. ఇళ్ల పథకం ప్రకటించినప్పుడల్లా దరఖాస్తులు పెడుతున్నా. కొన్నిరోజుల తర్వాత దరఖాస్తులు ఎటు పోతున్నాయో తెలువదు. మాలాంటి పేదలకు త్వరగా ఇల్లు మంజూరు చేస్తేనే సంక్షేమ పథకాలకు సార్థకత ఉంటుంది. ఈసారి మాలాంటి వారికి ఇళ్ల పథకం నిధులు మొదటి ప్రాధాన్యతలో మంజూరు చేయాలి.

– రాధారపు రాజమణి, సిరికొండ

ఇల్లులేని వారు దరఖాస్తు చేసుకోండి



ఇల్లు లేని పేదలు వచ్చే నెల 6 లోగా ఆయా గ్రామాల్లో జరిగే ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులు పరిశీలించి వివరాలు ఉన్నతాధికారులకు పంపిస్తాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు అర్హులకు ఇళ్లు మంజూరవుతాయి. ఇల్లు లేని వారు దరఖాస్తు చేసుకుంటేనే ప్రయోజనం చేకూరుతుంది.

– జనార్దన్, ఎంపీడీవో, కథలాపూర్

ప్రజాపాలనతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మెట్‌పల్లి/మల్లాపూర్: పథకాల అమలులో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సూచించారు. పట్టణంలోని 11 వార్డు వెంకట్రావ్‌పేటలో, మల్లాపూర్ మండలంలోని మల్లాపూర్, రాఘవపేట, మొగిలిపేట గ్రామాల్లో శనివారం జరిగిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికి అందేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జగదీశ్వర్, కొమిరెడ్డి లింగారెడ్డి డీఆర్డీవో నరేశ్ మల్లాపూర్ ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు,ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా,ఎర్దండి, తిమ్మాపూర్ గ్రామాల్లో శనివారం ప్రజాపాలన గ్రామసభలను అధికారులు పరిశీలించారు. డబ్బా గ్రామంలో జెడ్పీ సీఈవో రఘువరన్ సందర్శించి, దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. తిమ్మాపూర్‌లో జువ్వాడి నర్సింగరావు పరిశీలించారు.

జగిత్యాలరూరల్: ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్, తిప్పన్నపేట, మోతె గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలకు అర్హులైన ప్రజలకు దరఖాస్తులు స్వీకరించారు.

మేడిపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల పథకాన్ని భీమారం మండల కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యంగా పెళ్లి అయిన వారు రేషన్ కార్డు కోసం ఎక్కువగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలియజేశారు.

కథలాపూర్: మండలంలోని అంబారిపేట, భూషణరావుపేట, చింతకుంట గ్రామాల్లో శనివారం జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో 2,335 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



మోహన్‌రావుపేటలో దరఖాస్తు చేస్తున్న ప్రజలు

పెగడపల్లి: మండలంలో శనివారం నిర్వహించిన ప్రజాపాలనకు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. పెగడపల్లి, నందగిరి. సుద్దపల్లి గ్రామాల్లో గ్రామ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి 2243 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు.

రాయికల్: అర్హులైన వారు ప్రజాపాలనకు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్‌చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. శనివారం రాయికల్ పట్టణంలోని 2, 6, 10 వార్డులు, మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కోరుట్ల/కోరుట్ల రూరల్ : ప్రజాపాలనకు మూడో రోజు దరఖాస్తుల వెల్లువ కొనసాగుతోంది. శనివారం పట్టణంలోని 9, 10, 15, 16 వ వార్డుల్లో 5481 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. మండలంలోని మాదాపూర్, మోహన్‌రావుపేట గ్రామాల్లో 1615 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ కోరుట్ల ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, ఆర్డీవో రాజేశ్వర్ పరిశీలించారు.

రాములోరి అక్షింతల శోభాయాత్ర





రాజక్కపల్లి, అయిలాపూర్‌లో శ్రీరాముని అక్షింతలు ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్, సంగెం గ్రామాలకు అయోధ్య శ్రీరాముని అక్షింతలు శనివారం చేరాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అక్షింతలను శోభాయాత్ర నిర్వహించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు చెప్యాల నర్సయ్య, పిడుగు రాధ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాయికల్: శ్రీరాములవారి అక్షింతలు శనివారం దావన్‌పల్లి గ్రామానికి చేరాయి. గ్రామంలోని పుర వీధుల గుండా అక్షింతలను శోభాయాత్ర నిర్వహించారు. ప్రతి ఇంటింటికీ పంపిణీ చేస్తామని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తెలిపారు.

వెల్గటూర్: మండలంలోని రాజక్కపల్లికి శనివారం అయోధ్య రాముని అక్షింతలు చేరుకోగా, గ్రామస్తులు హనుమాన్ ఆలయం వరకు మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. సర్పంచ్ బోడకుంటి రమేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలో ఉన్న అయోధ్య రామయ్య అక్షింతలను ముత్యంపేటలో ఘనంగా ఊరేగించారు. శ్రీ వాగ్దేవి పాఠశాల విద్యార్థుల కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్: అయోధ్య రామమందిర రాముని అక్షింతలు శనివారం మల్లాపూర్ మండలంలోని రేగుంట గ్రామానికి చేరుకున్నాయి. స్థానిక హనుమాన్ దేవాలయంలో అయోధ్య రాముని అక్షింతలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ దీక్షా పీఠం, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.

ప్రభుత్వ విప్‌కు వినతులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం పర్యటించగా, పలు సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు ఇచ్చారు. రాళ్లవాగు ప్రాజెక్టు కాలువ పనులు త్వరగా పూర్తి చేయించాలని వార్డు సభ్యుడు గడ్డం రాజేశ్వర్‌రెడ్డి విన్నవించారు. గ్రామాలకు డబుల్ రోడ్డు సౌకర్యం, వరద కాలువ ఎత్తిపోతల పనులు చేపట్టాలని రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు గడ్డం భూమారెడ్డి వినతిపత్రం ఇచ్చారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నీటి వసతి కోసం బోరుబావి, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంలు రాజయ్య, విష్ణు వినతిపత్రం అందించారు.

జీపీ భవనం ప్రారంభం

సారంగాపూర్: బీబీఆర్ఎస్ ప్రభుత్వం మొన్నటి వరకు అమలు చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో కేంద్రం వాటా శూన్యం అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం మండలంలోని ఒడ్డెరకాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, సర్పంచ్‌లు పల్లపు వెంకటేశ్, గుర్రాల రాజేందర్‌రెడ్డి, ఎడమల జయ, పాంపర్తి లక్ష్మి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

మల్యాల: ప్రజలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి అన్నారు. మండలంలోని గుడిపేటలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ తిరుపతి, పోలీసులు స్థానికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం ప్రకారం పౌరులందరూ సమానమేనని, వివక్ష చూపరాదని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొట్టె హన్మండ్లు, కార్యదర్శి తేజస్విని, స్థానికులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

మల్లాపూర్: ఐకేపీ మండల ఏపీఎంగా దేవరాజం శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏపీఎంను ఐకేపీ సీసీలు లక్ష్మీరాజం, రమేశ్, రాజు స్రవంతి, సీవో నవీన్, అకౌంటెంట్ రమ, మండల సమాఖ్య అధ్యక్షురాలు, కోశాధికారి తదితరులు అభినందనలు తెలిపారు.

వేంకటేశ్వరాలయంలో కలశపూజ, కుంకుమార్చన



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కోరుట్ల: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పురాతన వేంకటేశ్వర ఆలయంలో శనివారం కలశ పూజ, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విక్రమ్, అర్చకులు బీర్నంది నరసింహాచారి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: పట్టణంలో ఆధార్ కార్డు సెంటర్‌ను ప్రారంభించాలని శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణ ప్రజలు ఆధార్ కార్డుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్డుల కోసం బుగ్గారం, జగిత్యాల వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయని, అధికారులు స్పందించి ఆధార్ కార్డు సెంటర్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు లవన్‌కుమార్, పిల్లి శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, గాజు భాస్కర్, పల్లెర్ల సురేందర్, వెలుగందుల ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేట ఎంపీటీసీ కారుకూరు నర్సయ్యతో పాటు నాగులపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సుమారు 80 మంది శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కేడీసీసీ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: కేడీసీసీ బ్యాంక్ సేవలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో నరేశ్ అన్నారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలో కేడీసీసీ బ్యాంక్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ మెనేజర్ భూక్య ప్రవీణ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశ్రీనివాస్, ప్యాక్స్ సీఈవో పాదం భూమేశ్, కేడీసీసీబీ ఫీల్డ్ అధికారి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మేడిపల్లి: ఉమ్మడి మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని మేడిపల్లి ఎస్సై శ్యాంరాజ్ అన్నారు. శనివారం మాట్లాడుతూ కొత్త సంవత్సరం పురస్కరించుకుని 31 తేదీ రాత్రి ట్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, భారీస్పీకర్లు పెట్టి ఇతరులను ఇబ్బంది పెట్టడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరుగురిని కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

మెట్‌పల్లి: వివిధ కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న మెట్‌పల్లి, వేంపేట, వెల్లుల్లకు చెందిన ఆరుగురు నిందితులను శనివారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రజలకు ఏ అవసరమున్నా రాతపూర్వకంగా దరఖాస్తులు స్వీకరించాలి

సారంగాపూర్: అధికారులు ప్రజలకు ఏ అవసరమున్నా రాత పూర్వకంగా దరఖాస్తు తీసుకుంటే దానిని ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆర్డీవో నర్సింహ్మమూర్తి అధికారులకు సూచించారు.మండలంలోని రంగపేటలో శనివారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేర్కొన్న ఆరు గ్యారంటీలతో పాటు, రేషన్‌కార్డులు, ఇతర సమస్యలపై దరఖాస్తులు ఇచ్చినా వాటిని ప్రజల నుంచి స్వీకరించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మిలింద్, తహసీల్దార్ రమేశ్, ఆర్‌ఐ కృష్ణ మండల ప్రత్యేకాధికారి సుధీర్‌కుమార్, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీవో రాజేందర్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ధర్మపురి: మండలంలోని నిరుపేద విద్యార్థులకు ఫేస్‌బుక్ మిత్రులు అందించిన రూ. 2.25 లక్షల సాయంతో 45 సైకిళ్లు కొనుగోలు చేసి శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ధర్మపురి, ఎండపెల్లి, సారంగాపూర్ మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు ప్రతి రోజూ నడుస్తూ పాఠశాలలకు వెళ్తున్నారు. వారికి సైకిళ్లు పంపిణీ చేయించాలని ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ ఈనెల 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేయగా, స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, కర్ణాటకకు చెందిన బళ్లారి మిత్రులు, ఇతర దాతలు స్పందించి రూ. 2.25 లక్షలు విరాళాలు అందించారు. వాటితో రమేశ్ 45 సైకిళ్లు కొనుగోలు చేయించి శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో తహసీల్దార్ కృష్ణ చైతన్య చేతుల మీదుగా పంపిణీ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, వెంకటరమణ, జగిత్యాల సత్యసాయి అభయ హస్తం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఎస్పీ మండల కమిటీ నియామకం

గొల్లపల్లి: మండల కేంద్రంలో శనివారం ఎంఎస్పీ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మహాజన సోషలిస్టు పార్టీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఓరగంటి జాను, ప్రధాన కార్యదర్శిగా చొప్పదండి చంద్రయ్యను నియమిస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముక్కల శ్రీనివాస్, ఎంఎస్పీ డివిజన్ ఇంచార్జ్ నక్క సతీష్ మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ర లక్ష్మణ్ మాదిగ, మధుకర్, రమేశ్, గంగయ్య పాల్గొన్నారు.

పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి

కోరుట్ల: రాష్ట్రంలోని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణా పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేట్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. పట్నంలోని పెన్షనర్స్ డివిజన్ కార్యాలయంలో శనివారం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ నెల మొదటి తేదీనే పెన్షన్ డబ్బులు విడుదల, పెండింగ్ డీఏ , మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు, అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించేలా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పబ్బ శివానందం, కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్, ఉపాధ్యక్షుడు ఎండీ సైఫొద్దీన్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సిరిసిల్ల సెర్ప్ డీపీఎం నర్సయ్యకు నివాళి

జగిత్యాలరూరల్: అనారోగ్యంతో మరణించిన సిరిసిల్ల సెర్ప్ డీపీఎం నర్సయ్యకు జిల్లా సెర్ప్ కార్యాలయం జగిత్యాల, మేడిపల్లి మండల శాఖ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది శనివారం సాయంత్రం ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీడీ సుధీర్, డీపీఎంలు మాణిక్‌రెడ్డి, భారతి, వెంకటేశ్, మల్లేశం, ఏపీఎంలు హుస్సేన్, గంగాధర్, రమ, భాగ్య పాల్గొన్నారు.

ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి హైస్కూల్, మండలంలోని కుమ్మరిపల్లి గ్రామాల్లో శనివారం ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో గుడ్‌బై 2023, వెల్‌కమ్ 2024 ఆకృతిలో విద్యార్థులు కూర్చున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మచ్చ గంగాధర్,హెచ్‌ఎం రాందాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో శనివారం ముందస్తుగా నూతన సంవత్సరం వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాలలో ఉపన్యాసకులు, విద్యార్థులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని లాస్య ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుష్మ, కరస్పాండెంట్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచారం..

మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువు పెంపు

జగిత్యాల: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థినీ, విద్యార్థులు 2023–24 సంవత్సరానికి గాను మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నుంచి వస్తున్న విద్యార్థులు కళాశాలల్లో ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 31 వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబేద్కర్ యూనివర్సిటీ పరీక్షలకు ఫీజు గడువు జనవరి 17

మెట్‌పల్లి: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ద్వితీయ సంవత్సరం థర్డ్ సెమిస్టర్, తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన ఫీజును వచ్చే నెల 17 తేదీ లోపు చెల్లించాలని స్థానిక స్టడీ సెంటర్ సమన్వయకర్త రాజేందర్, అకడమిక్ కౌన్సిలర్ కడకుంట్ల దశరథం తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలకు 756984174 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని పేర్కొన్నారు.